# ఆలోచన అమృతం

"ఎంతవరకొచ్చింది వంట!" భర్త ప్రశ్నకి తలతిప్పి చూసింది కమల.

"అయిపోయింది."

"నేను వెళ్ళి వాళ్ళను తీసుకొస్తాను. బస్‌స్టాప్ దగ్గర నుంచి ఫోన్ చేశారు."

"సరే."

రాఘవ బయటకి వెళ్ళగానే స్టవ్ ఆఫ్ చేసి యివతలకి వచ్చింది కమల.

ఇల్లంతా ఒకసారి పరీక్షించి, ఏ వస్తువూ స్థానభ్రంశం చెందలేదని నిర్ధారించుకున్నాక హాల్లోకి నడిచి ఓ మాగజైన్ చేతిలోకి తీసుకుని కూర్చుంది.

ఆమె విద్యాధికురాలు. ఉద్యోగస్థురాలు కూడా.

ఇంటిపనీ.. ఉద్యోగమూ.. రచనా వ్యాసంగమూ.. సంగీతమూ.. చాలా విషయాలలో చెప్పుకోదగ్గ ప్రావీణ్యం ఉన్న కమలకి అతిథులనీ, అభ్యాగతులనీ ఆదరించే అవకాశం కొంచెం తక్కువే.

ఒకరి యింటికి వెళ్ళేందుకు కానీ, ఒకర్ని తమ యింటికి పిల్చేందుకు కానీ ఆమె సాధారణంగా సమయాన్ని కేటాయించలేదు.

అయితే ఆవేళ వస్తూన్న అతిథుల ప్రాముఖ్యత వేరు. కళ్యాణ్ రాఘవకి మంచి స్నేహితుడు. ప్రవాసాంధ్రుడు.

తెలుగు పత్రికలలో అతను వ్రాసే వ్యాసాలూ , విశ్లేషణలూ , సమీక్షలూ, విమర్శలూ శ్రద్ధగా చదువుతుందామె. ఎటొచ్చీ అతన్ని చూసే అవకాశమే యింతవరకూ రాలేదు.

"మన సంప్రదాయాల గురించీ ఆచార వ్యవహారాల గురించీ అంత చక్కగా, విశ్లేషణాత్మకంగా వ్రాసే అతను చూడటానికి ఎలా వుంటాడో!" అనిపించింది కమలకి.

నిజానికి కమలకి కూడా అన్నిపనులూ పద్ధతి ప్రకారం చేయాలన్న కోరిక వున్నా.. తన వుద్యోగం, యితర వ్యాపకాల వల్ల కొన్ని కొన్ని వదిలేయక తప్పడం లేదు.

అందుకే ఆమెకి కళ్యాణ్ రాక కొంచెం భయాన్ని కలిగిస్తోంది. తమ జీవన విధానం అతని విమర్శకి గురవుతుందేమోనని బెరుకుగా వుంది. ఇంటిని ఎంతో శ్రద్ధగా అలంకరించింది. వంట చాలా శుచిగా చేసింది. అతిథి మర్యాదకు సర్వసన్నాహాలతో సిద్ధంగా వుంది. అయినా ఏదో బెరుకు.

ఆమె ఆలోచనలలో వుండగానే రాఘవ స్నేహితుడితో తిరిగి వచ్చాడు.
"మా కళ్యాణ్. వైదేహిగారు." అంటూ రాఘవ పరిచయం చేస్తుంటే కమల చిరునవ్వుతో ఆ దంపతులకి నమస్కరించింది.
ముందు అందరికీ ఒక విడత కాఫీ యిచ్చింది. అది తాగుతూ కబుర్లలో పడ్డారు.
ఎక్కువగా కళ్యాణే మాట్లాడసాగాడు. మిగతా ముగ్గురూ అతనికి శ్రోతలయ్యారు.
జ్యోతిష్యం.. పురాణాలు.. శాస్త్రాలు.. ఆచారాలు.. ఏ విషయం తీసుకున్నా అనర్గళంగా మాట్లాడుతున్నాడతను.
రెండు గంటలసేపు కబుర్లతో ఎలా గడిచిందో తెలీదు. కమల వంటగదిలోకి నడిచి, అప్పడాలు, వడియాలు వేయించసాగింది. బయటినుంచి వాళ్ళమాటలు వినిపిస్తూనే వున్నాయి.
పెద్దవాళ్ళమాటలు చద్దిమూటలనీ.. వాళ్ళు చెప్పిన ప్రతిమాటనీ ఆచరించడం అత్యవసరమనీ.. శాస్త్రాలలో చెప్పినవన్నీ నిర్వర్తించాల్సిన బాధ్యత ప్రతిమనిషికీ వుందనీ అంటున్నాడు కళ్యాణ్.
డైనింగ్‌టేబుల్ మీద కంచాలూ, గ్లాసులూ సర్ది "భోజనానికి రండి." అంది కమల.
చేతులు కడుక్కుని వస్తూ "నువ్వు కూడా కూర్చో" అన్నాడు రాఘవ.
"నేను తర్వాత తింటానులెండి." అంది ఆమె వాళ్ళ ముగ్గురికీ వడ్డిస్తూ. ఆతర్వాత తన సహజమైన చిలిపితనంతో ప్రశ్నించింది.
"భర్తకి వడ్డించాకే భార్య తినాలంటారేమో కదండీ మన పెద్దవాళ్ళు!" అని.
"అవును." షర్ట్ చేతులు పైకి తోసుకుంటూ సమాధానమిచ్చాడు కళ్యాణ్.
" ఎందుకనో!" అంది కంచాలలో కూర వడ్డిస్తూ యింకాస్త అల్లరిగా. అభ్యుదయ భావాలూ, ఆచారాలపై అభిమానమూ కలగలిసిన కళ్యాణ్ దానికేం సమాధానం చెప్తాడో అన్న ఆసక్తి ఆమె కంఠంలో ధ్వనించింది.
అయితే పెద్ద చర్చకు తావివ్వడం యిష్టంలేనివాడిలా "వున్నాయి దానివల్ల కొన్ని లాభాలు" అన్నాడు అతను ముక్తసరిగా.
"లాభాలూ కాదు. గాడిదగుడ్డూ కాదు. ఆ ఆచారాలన్నీ మగవాళ్ళు తమ పెత్తనం సాగించుకోవడానికి చెప్పిన మాయమాటలంటారు కదురా!" అన్నాడు రాఘవ.
"ఎవరంటారు!"

భుజాలు కుదించాడు రాఘవ. ఏం చెప్పాలో అర్థం కానట్లు ఒక్క క్షణం కళ్ళు చికిలించి "స్త్రీవాదులు." అన్నాడు.
భర్త సమాధానానికి చిన్నగా నవ్వింది కమల.
"స్త్రీవాదులా!" కళ్యాణ్ కూడా నవ్వాడు. "సంతోషంగా వున్న స్త్రీవాదినొకర్ని తీసుకురా నాదగ్గరికి.. మాట్లాడాలి." అన్నాడు తమాషాగా తల ఎగరేస్తూ.
కమల విభ్రమంగా చూసింది. ఏమిటీతని ధోరణి! పురుషుడు కనుక సహజంగా స్త్రీవాదం నచ్చకపోవచ్చు. అంత మాత్రం చేత దాన్ని యింత బాహాటంగా విమర్శించే ధైర్యం యితనికి ఎలా వచ్చింది!
ఇంత నిర్భయంగా స్త్రీవాదాన్ని ఖండించేందుకు యితనికి వున్న ఆధారాలు ఏమిటో!
ఆసక్తి వెల్లువవుతుండగా "నేటి స్త్రీల వాదనలో న్యాయం లేదంటారా!" అంది.
"ఇందులో న్యాయాన్యాయాల ప్రసక్తి ఏముంది! స్త్రీలకి గానీ.. పురుషులకి గానీ కొన్ని విధులు, కర్తవ్యాలు నిర్వచించబడ్డాయి. ఎవరిపనులు వాళ్ళు చేయడంలోనే అందముంది."
" అదెలా! ఆ నిర్వచనాల్లో అన్యాయముంటే!"
" అన్యాయమేమీ లేదు." కళ్యాణ్ స్పష్టంగా చెప్పాడు.
కొన్నివేల ప్రశ్నలు కెరటాల్లా ఎగసిపడ్డాయి కమల మనస్సులో. కానీ అన్నం వడ్డిస్తూ వాదనకి దిగడం బాగుండదేమోననిపించింది.
ఒక గుటక వేసి తన ప్రశ్నలని గొంతులోనే అదిమేసింది. అన్నం మీద నెయ్యి వేస్తూ "కానివ్వండి." అంది చిరునవ్వుతో.
కానీ ఆమె హృదయంలోని ఆరాటం తగ్గలేదు. వాళ్ళు రెండు ముద్దలు తిన్నాక, ఒక్కొక్క మాటని కూడదీసుకుంటూ మెల్లగా అడిగింది.
"నియమాలు, సేవలు, కర్తవ్యాలు అన్నీ ఆడవాళ్ళకే పెట్టడం అన్యాయం కాదంటారా!"
"ఆడవాళ్ళకి మాత్రమే ఎక్కడ పెట్టారు! మగవాళ్లకీ పెట్టారుగా! తల్లిదండ్రుల సేవ.. అతిథుల సేవ.. యివన్నీ మగవాళ్ళకి వున్నాయి కదా! సేవలొక్కటే కాదు. అంతకు మించిన బాధ్యతలు కూడా వున్నాయి పురుషులకి. బ్రాహ్మణుడు బ్రాహ్మణ ధర్మాన్నీ, క్షత్రియుడు క్షత్రియ ధర్మాన్నీ నెరవేర్చాల్సిన విధి వుంది.

యుద్ధం వస్తే రాజు భయంతో యింట్లో కూర్చోవడానికి లేదు. కానీ స్త్రీలకి మాత్రం ఏ వర్గానికి చెందినవారికైనా ఒకటే కర్తవ్యం. పతిసేవ. ఆవిధంగా చూస్తే మగవాళ్లకంటే ఆడవాళ్ళే లక్కీ కదా!" అన్నాడు కళ్యాణ్ నవ్వుతూ.

"ఆడవాళ్ళు భర్తకొక్కడికీ సేవ చేస్తే చాలు. మగవాళ్ళు అందరినీ సేవించాలి." అంది వైదేహి భర్తని సమర్థిస్తూ. "భార్యకి భర్తే దైవం. ఆయన సేవ తర్వాతే యింకేదయినా" అని కూడా అంది.

"ఓరి దేవుడోయ్" అనిపించింది కమలకి.

దానితోపాటూ వైదేహి గ్రాడ్యుయేట్ అన్న విషయం కూడా గుర్తొచ్చింది.

ఆలోచనలని బలవంతంగా తెంచుకుని వడ్డనలో పడింది.

వైదేహి మాత్రం కొనసాగించింది "అసలు యిదివరకు పతివ్రతలు ఎలా వుండేవారు ! అరుంధతి.. అనసూయ.. ఆవిడెవరండీ! భర్తని బుట్టలో కూర్చోపెట్టుకుని తీసుకు వెళ్తుందీ!" ముద్దుముద్దుగా అడిగింది.

"సుమతి." అంతకన్నా ముద్దుగా జవాబిచ్చాడు కళ్యాణ్.

"ఆ!. సుమతి. ఎంత బాగుంటాయో ఆ కథలు చదువుతుంటే!"

వైదేహి మాటలు విన్న కమలకి స్పృహ తప్పినంత పనయ్యింది.

ఇదేం చిత్రం! ఈరోజుల్లో కూడా యిలా భర్తా, పాతివ్రత్యమూ అంటూ మాట్లాడే స్త్రీలున్నారా! పతివ్రతల కథల్లోని అసహజతని ఎంజాయ్ చేసేవాళ్ళున్నారా!

వైదేహి యిదంతా మనస్ఫూర్తిగా అంటోందా! లేక కళ్యాణ్‌ని సంతోషపెట్టేందుకు యిలా నటిస్తోందా! నటన మాత్రం ఎలా సాధ్యం!

ఒకరోజా! రెండు రోజులా! ఒకమనిషిని సంతోషపెట్టేందుకు జీవితమంతా నటించడం అసలు సాధ్యమా!

సాధ్యాసాధ్యాల మాట అలా వుంచి అసలెందుకలా వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం! ఇంత చదువుకునీ ఆలోచన లేకుండా బ్రతకడమెందుకు!

భర్త చెప్పిన ప్రతి విషయాన్నీ గుడ్డిగా సమర్థించడమెందుకు!

ఎందుకంటే.. అందులోనే ఆనందం వుంది. జీవన మాధుర్యం వుంది అంటున్నారు భార్యాభర్తలిద్దరూ తడుముకోకుండా.

ఇక లాభం లేదని సూటిగా అడిగింది కమల . "ఇదివరకు రోజుల్లో వేరు. ఇపుడు ఆడవాళ్ళు కూడా చదువుకుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ళకీ ఆలోచన వుంది. వాళ్ళు పూర్వకాలం పతివ్రతలలా ఎలా బ్రతగ్గలరు!"

"బ్రతగ్గలరు అని నేను చెప్పడం లేదు. కానీ అలా బ్రతకడంలో ఆనందం వుంది అంటున్నాను."

"అదే ఎలా! ఆనందం ఎలా వుంటుంది! భర్త చెప్పేది మూర్ఖంగా వున్నా, తర్కానికి అందకపోయినా ప్రశ్న లేకుండా అనుసరించడంలో ఆనందం ఎలా వుంటుంది!"

నవ్వి వూరుకున్నాడు కళ్యాణ్. సమాధానం చెప్పలేదు.

దాంతో మరికాస్త ధైర్యం తెచ్చుకుని తనమాటల్ని విశ్లేషించబోయింది కమల, "ఇపుడొక లేడీడాక్టర్ వుంటుందనుకోండి..."

"ఓహో! అసలు ముందు ఆవిడ చదువుకుని డాక్టరయ్యేదాకా వచ్చిందన్న మాట విషయం!" అన్నాడు కళ్యాణ్ ఆమె మాటలకి అడ్డం వస్తూ.

"అంటే!" అంది కమల హతాశురాలవుతూ. "ఆడవాళ్ళు చదువుకోడం కూడా అనవసరమంటారా!"

"భర్తకి సేవ చేసేందుకు చదువెందుకు!" ఎదురు ప్రశ్న వేశాడు కళ్యాణ్.

తల దిమ్మెరపోయినట్లయింది కమలకి. ఒక యింజినీర్.. ఒక గొప్ప సంస్థలో మంచి పొజిషన్‌లో వున్న ప్రతిభావంతుడు.. నాగరికుడు మాట్లాడుతున్న మాటలా యివి!

ఆమెకి ఒక్కక్షణం ఏమనేందుకూ గొంతు పెగలలేదు. ఎలాగో తేరుకుని అడిగింది

"ఆడవాళ్ళు అన్ని రంగాలలోనూ తమ సమర్థతని నిరూపించుకుంటున్నారు కదా! ఒక్కొక్కసారి పురుషులకన్నా ప్రతిభావంతంగా కనిపిస్తున్నారు కదా! మరి అవన్నీ వదులుకుని యింట్లో వుండమనడం అన్యాయం కాదూ!"

"అన్యాయం కాదని యిందాకే చెప్పాను కదా ! మళ్ళీ మొదటికి వచ్చారేమిటి!" అన్నట్లుగా చూశాడు కళ్యాణ్.

మరోసారి స్పష్టంగా చెప్పాడు. "లేదు. అన్యాయమేమీ లేదు. ఒక మనిషికి జీవితాన్ని అంకితం చేయడం కంటే గొప్పతనం లేదు. భర్తకి సేవచేసే స్త్రీలే యిహలోకంలోనూ, పరలోకంలోనూ కూడా సుఖపడతారు."

"అంటే దేశాన్ని పాలించిన ఇందిరాగాంధీ కంటే భర్తకి సేవలు చేస్తూ బ్రతికే యిల్లాలే గొప్పదంటారు!" వద్దనుకున్నా ఆవేశం తొంగిచూసింది కమల గొంతులో.

కంచంలోని అన్నం కలుపుకుంటూనే కళ్ళు మాత్రం పైకెత్తి ఆమెని చూసి మనోహరంగా నవ్వాడు కళ్యాణ్.

మీరు నిజంగా వాదించదల్చుకుంటే నా దగ్గర అన్నిటికీ సమాధానం వుంది, అన్న ధోరణి కనిపించింది ఆ నవ్వులో.

"అవును. శాస్త్రానికి సంబంధించినంతవరకూ ఇందిరాగాంధీ కంటే భర్త సేవలో తరించే స్త్రీయే గొప్పది." అన్నాడు మృదువయిన స్వరంతో.

ఆత్మవిశ్వాసంతో కూడిన అతని నవ్వూ, స్వరమూ కమలకి మైమరపుని కలిగించాయి. అయితే ఆమె మనసు మాత్రం అంత సులభంగా అతను చెప్పిన విషయాన్ని ఒప్పుకోలేకపోతోంది.

"ఏమో! మీరు చెప్పేదాన్ని నేను ఒప్పుకోలేకపోతున్నాను. వైదేహిగారిలా నేను పతివ్రతల కథలనుంచీ స్ఫూర్తి పొందలేకపోతున్నాను." అంది.

ఆమాటల్లో ఏమాత్రం వ్యంగ్యం వుందో పరీక్షించడానికన్నట్లూ కళ్యాణ్ చురుగ్గా చూశాడు.

అతని చూపుకి కొద్దిగా తడబడుతూ "అహ! అరుంధతీ.. అనసూయలాంటి పతివ్రతలు యిపుడు కనపడడంలేదు కదా! మహత్యాలు చూపడం లేదు కదా! అలాంటపుడు పాతివ్రత్యం వల్ల వచ్చే శక్తి చదువూ.. విజ్ఞానాల వల్ల వచ్చే శక్తి కన్నా గొప్పదని ఎలా నమ్మమంటారు!" అంది అమాయకంగా చూస్తూ.

"ఎందుకులేరూ ఇపుడు మాత్రం అలాంటివాళ్ళు! భర్తమాటకి జవదాటకుండా.. భర్త సేవలోనే ఆనందం పొందేవాళ్ళు ఎందుకులేరూ! మాకు తెలిసిన ఒక ఆవిడ వుంది, శైలజామూర్తి అని. ఆయన పరమ మూర్ఖుడు. అందరితో తగాదాలే. ఆయనంటే ఎవరికీ సరిపడదు. కానీ కేవలం ఆవిడని చూసి ఆ ఫ్యామిలీతో ఫ్రెండ్షిప్ చేస్తారు చాలామంది." అన్నాడు కళ్యాణ్.

"ఏం చేస్తుందావిడ!" కళ్యాణ్‌కి సాంబారు వడ్డిస్తూ ఆసక్తిగా అడిగింది కమల.

"ఏం చేయదు. ఆయన ఏమన్నా పట్టించుకోదు. దూషించదు. భగవంతుడిని ధ్యానిస్తుంది. పూజలు చేసుకుంటుంది.

వాళ్ళిద్దరూ కలిసి బయటకి వస్తే ఆవిడని చూడగానే ప్రతివారూ నమస్కారం చేస్తారు. ప్రక్కనే ఆయన వుంటే చేయాలా వద్దా అని ఆలోచించి ఆలోచించి చివరికి నమస్కారమండీ! అంటారు. దానితో ఆయనకి యింకాస్త కోపం రావడం.. యింటికెళ్ళి మళ్ళీ ఆవిడ్ని తిట్టడం.. కొట్టడం.. ఆవిడ యింకాస్త సహనం చూపించడం. దానితో అందరికీ యింకాస్త గౌరవం పెరగడం.."

అతను చెప్తుంటే కమల మధ్యలో అడ్డుకుంది. "కావచ్చు. ఆవిడ సహనం ఆవిడమీద గౌరవాన్ని కలిగిస్తే కలిగించవచ్చు. కానీ అదే జీవితపరమావధి అని మీరెలా చెప్తారు! భర్తని గౌరవిస్తే చాలు స్వర్గానికెళ్తుంది.. పరం గ్యారంటీ అని మీరెలా చెప్తారు!"

కళ్యాణ్ నవ్వాడు. "పరం గ్యారంటీనే. అదెలా గ్యారంటీనో నేను చెప్తాను. అయితే యిహం గ్యారంటీ అని ఒప్పుకుంటున్నారన్న మాటేగా!"

"అహ! నేనొప్పుకోలేదు." కంగారుగా అనబోయింది కమల. కానీ హటాత్తుగా ఆమె గొంతుకి ఏదో అడ్డం పడినట్లయింది.

తన వైవాహిక జీవితం కళ్ళముందు గిర్రున తిరిగింది. దాంతోపాటూ... తనకు తెలిసిన కొన్ని వందలమంది స్త్రీల జీవితాలూ.. స్వభావాలూ.. సంఘంలో వారికి వున్న స్థానాలూ.. గౌరవాలూ అన్నీ కళ్ళముందు మెదిలాయి.

నిజమే! అమాయకంగా వుండే స్త్రీలూ.. ఎక్కువ ఆలోచించని స్త్రీలూ.. భర్త, పిల్లలే లోకంగా బ్రతికే స్త్రీలూ.. వీళ్ళే సమాజంలో ఎక్కువ గౌరవాన్ని పొందుతున్న వాళ్ళూ.. ఎక్కువ సుఖపడ్తున్న వాళ్ళూ.

సామాన్యమయిన స్త్రీలకంటే ప్రతిభావంతులయిన స్త్రీలు పొందే గొప్ప ఆదరణేమీ లేదు. ఎంతో మేధాసంపత్తిని కనపర్చి, ఒక విషయాన్ని విశ్లేషణాత్మకంగా చెప్పిన స్త్రీని గౌరవించినట్లే.. "నాకేమీ తెలీదండీ! మా ఆయన్నడగాలి" అనే స్త్రీనీ గౌరవిస్తారు. ఎంతో ధైర్యసాహసాలు కనపర్చి అంతరిక్షంలోకీ.. అగాధాల్లోకీ చొచ్చుకుపోగలిగిన స్త్రీని గౌరవించినట్లే.. "నాకు భయమండీ, మా ఆయన లేకుండా నేనెక్కడికీ వెళ్ళను." అనే స్త్రీనీ గౌరవిస్తారు.

ఇంకా చెప్పాలంటే మొదటివాళ్ళని ఒకరకమైన చిరాకుతోనూ, అసహనంతోనూ గౌరవిస్తారు...

రెండోవాళ్ళని ఆత్మీయంగా, సహజంగా గౌరవిస్తారు!

ఇది దారుణమయితే అవునేమో కానీ.. నిస్సందేహంగా వాస్తవం!

నిజమే. తన చుట్టూ వున్న స్త్రీల కన్నా తను కనీసం నాలుగు రెట్లు ఎక్కువ కష్టపడుతుంది. తనకి ప్రావీణ్యం వున్న ఎన్నో విషయాలలో వాళ్ళకి కనీసం పరిచయం లేదు.

అంతమాత్రం చేత వాళ్ళ దృష్టిలో తన ఆధిక్యత ఏమీ పెరగలేదు.

తన భర్తకి గానీ.. అత్తమామలకి గానీ.. పిల్లలకి గానీ.. చివరికి.. చివరికి తన తల్లిదండ్రులకి గానీ.. తన ప్రతిభని చూసి కలిగే గొప్ప ఆనందమేమీ లేదు.

సంతోషిస్తారు. నిజమే. తను ఒక విషయంలో ప్రావీణ్యం చూపిస్తే వాళ్ళందరూ సంతోషిస్తారు. అయితే అంత కష్టపడకుండా.. కేవలం భర్తే లోకంగా బ్రతికితే కూడా వాళ్ళు సంతోషిస్తారు. తనని సంతోషపెడ్తారు.

ఆ భయంకర సత్యాన్ని జీర్ణించుకోలేక ఆమె కొట్టుమిట్టాడుతుంటే, కళ్యాణ్ మృదుమధురమయిన గొంతుతో చెప్పసాగాడు.

" అసలు బేసికల్‌గా స్త్రీ రజోగుణ ప్రధానురాలు. పురుషుడు సత్వ, తమోగుణ ప్రధానుడు. రజోగుణం అంటే తెలుసు కదా! విపరీతమయిన యాక్టివ్‌నెస్... నేను, నా సంసారం అనే అహంకారం.. యివన్నీ స్త్రీల లక్షణాలు.

సో.. మోక్షం రావాలంటే మనిషి ఈ అహంకారాన్ని వదులుకోవాలి. ఇల్లు కానీ.. యింటి పనులు కానీ.. పతిసేవ కానీ.. ఆమెలోని రజోగుణాన్ని చంపగలిగేవి. ఉద్యోగమూ.. బయటి ప్రపంచం.. ఒకటేమిటి! ఈ రోజు స్త్రీలకి వున్న వ్యాపకాలన్నీ రజోగుణాన్ని పెంపొందించేవే! ఆమెని మోక్షానికి దూరం చేసేవే!"

అతని మాటలలోని వాస్తవాన్ని మౌనంగా గ్రహించే ప్రయత్నం చేయసాగింది కమల.

"రెండురకాల పనులున్నాయి. ఇంటిపనులూ.. బయటిపనులూ. స్త్రీ పురుషుల సహజ లక్షణాలను బట్టి ఎవరు ఏపని బాగా చేయగలరో వాళ్ళకి ఆపని కేటాయించడం జరిగింది. రెండూ అవసరమయిన పనులే కదా! అరే! పొద్దున లేచి తిండి తినాలా! తినాలంటే వంట చేసుకోవాలా! వంట చేయాలంటే ఒక పద్ధతి ప్రకారం ఎవరో ఒకరు ఆపని చేసుకుపోవాలా! లేకపోతే ప్రొద్దున్నే లేచి మొగుడూ పెళ్ళామూ నువ్వా! నేనా! అని మొహాలు చూసుకుంటూ కూర్చుంటారా!"

అతను ఆమాటలు అన్న తీరుకి ఫక్కున నవ్వొచ్చింది కమలకి. నిజమేకదా! అనిపించింది.

"ఎంతకాదనుకున్నా ఆడవాళ్లకి యింటిపనులు చేయడంలోనే ఎక్కువ ఆనందం వుంటుంది." అన్నాడు కళ్యాణ్.

"అవును. ఎంత వుద్యోగం చేస్తున్నా మనదృష్టి ఎపుడూ యింటిమీదే వుంటుంది. ఇల్లు సరిగా పెట్టుకోలేదే! నీట్‌గా సర్దుకోలేదే! అనిపిస్తూ వుంటుంది. ఒక్కరోజు సెలవొచ్చిందంటే మనం యిల్లు సర్దుకోవడంలోనే గడుపుతాం. అదే మగవాళ్ళు చూడండి, వాళ్ళకి ఎలా వున్నా పట్టదు. నీట్‌గా లేని చోట మనం ఒక్క క్షణం ఉండగలమా!" వైదేహి భర్తకి వత్తాసుగా మాట్లాడింది.

అప్పటివరకూ అమాయకంగా కనిపించిన వైదేహి మాటల్లో కూడా ఏదో పాయింట్ వుందనిపించింది కమలకి. భార్యాభర్తలిద్దరూ అలా ఒకే తీరుగా జంటకవుల్లా మాట్లాడడం ముచ్చటగా కూడా తోచింది.

తనకీ.. రాఘవకీ ప్రతివిషయంలోనూ వాదనే. ఎంత ప్రేమ వున్నా.. దానికి అడుగున ఏదో తెలీని అసంతృప్తే!

మంత్రం వేయబడినట్లూ మౌనంగా మారిపోయింది కమల. ఆక్షణం.. వాళ్ళమాటలు వింటూంటే.. వాటిల్లో కొట్టిపారేయాల్సిందేమీలేనట్లు కనిపించింది.

నిజమే! తార్కికంగా చూసినా విజ్ఞానానికి దేవుడు మోక్షం యిస్తాడని వూహించలేం. మోక్షం అంటూ వస్తే సహనానికీ.. ఆత్మార్పణకే రావాలి. అంటే.. కళ్యాణ్ అన్నట్లూ పరానికి సోపానం పాతివ్రత్యమే. ఇహానికి ఆలంబనా పాతివ్రత్యమే!

"పెరుగు" రాఘవ మాటలకి వులిక్కిపడి అందరికీ పెరుగు వడ్డించింది.

రెండు ముద్దల్లో పెరుగన్నం తిని కళ్యాణ్ లేచి నిల్చున్నాడు. అతను వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్ళి చేయి కడుక్కుంటుంటే ఏదో అసహజంగా తోచింది కమలకి. కానీ అదేమిటో అర్థం కాలేదు.

ఇవతలకి వచ్చి అందరికీ వక్కపొడి అందించింది.

వక్కపలుకు నోట్లో వేసుకుంటూనే "ఇక వెళ్తాంరా!" అన్నాడు కళ్యాణ్.

"అదేంటి! కాసేపు వుండండి." అన్నాడు రాఘవ.

అతని భుజం చుట్టూ చేయివేసి దగ్గరికి తీసుకుంటూ "లేదురా! చెప్పాగా! ఇట్నుంచి భాస్కర్ వాళ్ళింటికి వెళ్ళాలి. ఇంకోసారి వస్తాంలే." అన్నాడు కళ్యాణ్ హడావుడి పడుతూ.

"సరిగా మాట్లాడుకున్నట్లే లేదు." అంది కమల.

"భలేవారే! బోలెడన్ని విషయాలు చర్చించాం కదండీ!" అన్నాడతను నవ్వుతూ.

వాళ్ళని బయటకి పంపి లోపలికి రాగానే "చాలా టైమయ్యింది. నువుకూడా తినేసెయ్" అన్నాడు రాఘవ కమలతో.

"తింటాను. ఇలా కూర్చోండి.." డైనింగ్‌టేబుల్ దగ్గర కుర్చీ యివతలకి లాగి కంచాలు తీయబోతూ చెప్పింది కమల.

ఆలోచించగలగడం కన్నా ఆలోచించలేకపోవడం.. తెలివిగా వుండడం కన్నా తెలివితక్కువగా వుండడం.. విజ్ఞానం సంపాదించడం కన్నా సంపాదించకపోవడం.. ఎక్కువ లాభకరం, సంతోషకరం అనే వాస్తవాన్ని జీర్ణించుకునే ప్రయత్నం చేస్తూ కంచాలు తీయబోయిన కమల వులిక్కిపడింది.

కళ్యాణ్ భోజనం చేయడంలోని అసహజత ఏమిటో ఆమెకి ఒక్కసారిగా అర్థమయింది. అతను ఔపోశన పట్టలేదు!

శాస్త్రం.. శాస్త్రం.. అంటూ ఘోషించిన అతను.. పెద్దవాళ్ళు చెప్పిన ప్రతిమాటకీ ఓ పరమార్థం వుందని చెప్పిన అతను.. భార్య ధర్మాలేవో తెలియపరచి ఆమెని అలాగే మలచుకున్న అతను .. తన ధర్మాల్ని తను సరిగా నిర్వర్తిస్తున్నాడా!

బొమ్మలా నిలుచుండిపోయిన కమలని తట్టి పిలుస్తూ "ఏమయింది!" అన్నాడు రాఘవ.

"ఏంలేదు" మెతుకులు ఎత్తుతూ బదులిచ్చింది కమల. "మీ ఫ్రెండ్ జంధ్యం వేసుకుంటాడా!" అంది.

రాఘవ చిత్రంగా చూశాడు. "వేసుకోడనుకుంటా. ఏం!" అన్నాడు.

"ఏం లేదు." మరోసారి అదే సమాధానం చెప్తూ నవ్వింది కమల.

స్త్రీలు ఆలోచనని ఎందుకు వదులుకోలేకపోతున్నారో.. గుడ్డిగా నడవడం లాభకరం అయినప్పటికీ ఎందుకు కళ్ళు మూసుకోలేకపోతున్నారో.. ప్రశ్నించకుండా వుండడం మోక్షదాయకమయినప్పటికీ.. ఎందుకు మౌనంగా వుండలేకపోతున్నారో ఆమెకు అర్థమయింది.

ఎందుకంటే. . ఆలోచన అమృతం. అది తనలాంటివాళ్ళలో కొంతసేపూ, వైదేహి లాంటి వాళ్ళలో కొన్నాళ్ళపాటూ. . ఆగిపోవచ్చు. కానీ ఎప్పటికీ చచ్చిపోదు. అది వున్న వాళ్ళని చావనివ్వదు.

*****